ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం ఉమ్మడి జిల్లాలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ఈసందర్భంగా కిక్కిరిశాయి. జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆలయాలను సందర్శించారు. ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు ఉదయం నుంచే ఆలయాల్లో దర్శనం కోసం క్యూ కట్టారు. కదిరిలోని శ్రీఖాద్రీ నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, నిర్వాహకులు తగిన ఏర్పాట్లను చేశారు.

కదిరి ఖాద్రీశుడి దర్శనానికి బారులుదీరిన ప్రజలు

వైసిపి బిసి నేతల్లో అలజడి..!

పార్టీలో ప్రాబల్యం తగ్గించాలన్న ఓసి నేత.. అసంతృప్తిలో బిసి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపిలో బిసి నేతల అలజడి నెలకొంది. పార్టీలో బిసిల ప్రాధాన్యత తగ్గించాలంటూ ఒక నేత వ్యాఖ్యలతో ఈ అలజడి నెలకొన్నట్టు తెలుస్తోంది. వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నా బిసి.. నా ఎస్సీ..ఎస్టీ అనడమే కాకుండా అధికారంలో ఉన్న సమయంలో వారికి తగిన ప్రాధాన్యతను కల్పించారు. వారికి లభించిన ప్రాధాన్యతను చూసి ఓసి నేతలు కొందరికి అసంతృప్తి నెలకొంది. వారి ప్రాధాన్యతను తగ్గించే యోచన చేస్తున్నట్టు బిసి నేతల్లో బలమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలో ఉన్న సమయంలోనూ ఇదే తీరున జిల్లాలో నడిచిందని చెబుతున్నారు. ఇప్పుడు పార్టీ అధికారంలో లేకపోయినా బిసిలను వెనక్కు నెట్టే ప్రయత్నాలను కొంత మంది నేతలు చేస్తున్నారన్న అసంతృప్తి వైసిపి బిసి నేతల్లో వ్యక్తమవుతోంది. పార్లమెంటు స్థాయి నేతకు ఇటీవల రాష్ట్ర స్థాయి పార్టీ పదవి లభించింది. ఆయనకు లభించిన ప్రాధాన్యత ఓసి నేత ఒకరికి నచ్చినట్టు లేదని తెలుస్తోంది. ఆయనకు ఎందుకు అంతటి ప్రాధాన్యతనిస్తున్నారు... తగ్గించాలన్నట్టు చేసిన వ్యాఖ్యలు బిసి నేతలను అసంతృప్తికి గురిచేశాయి. మరికొంత మంది నేతలు కూడా బిసి నేతల ప్రాధాన్యత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బిసి నేతలంతా ఇటీవల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి శంకర నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తోపాటు మరికొంత మంది నాయకులు పాల్గొన్నట్టు సమాచారం. గతంలో అధికారంలోనున్న సమయంలో ఒకరిద్దరు నాయకులు బిసి నేతల పట్ల ఇదే తీరుతో వ్యవహరించారని చర్చించినట్టు తెలుస్తోంది. శంకర నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో పెనుకొండ నియోజకవర్గానికి చెందిన ఒక ఓసి నాయకుడు ఒక ఎమ్మెల్యేతో మాట్లాడిన మాటలు అప్పట్లో పెద్ద చర్చకే దారితీశాయి. బిసి నేతలు బయట నుంచి వచ్చిన బాడుగ ఇంట్లోకి వచ్చిన వారని వ్యాఖ్యానించారు. వారు ఎప్పుడైనా బయటకు పోక తప్పదని కూడా మాట్లాడారు. ఇప్పుడు కూడా ఆ నేత ఇదే పద్ధతిలో మాట్లాడినట్టు బిసి నేతలు అసంతృప్తితో ఉన్నారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తే వారికి తగిన ప్రాధాన్యత కల్పించకపోవడంపై బిసి నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇస్తున్నా స్థానికంగా కొంత మంది నేతలు దాన్ని [illegible] ప్రయత్నం చేయడాన్ని ఏ రకంగా ఎదుర్కోవాలని ఈ సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది. దీన్ని అధిష్టానం దృష్టికి కూడా తీసుకెళ్లాలను ఆలోచన చేసినట్టు కూడా తెలుస్తోంది. ఏది ఏమైనా అధికారాన్ని కోల్పోయిన సమయంలో అందరినీ కలుపుకుని ముందుకుపోవాల్సింది పోయి ఈ రకంగా సామాజిక తరగతి వారీగా ప్రాధాన్యతలపై కుంపట్లు పెట్టుకోవడం ఆ పార్టీ శ్రేణుల్లోనూ గుబులు రేపుతోంది.

దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడటంలో

భారతీయ రెవెన్యూ సర్వీస్ అధికారుల పాత్ర కీలకం

కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి

అట్టహాసంగా 74వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్

గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్రమంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాటంలో భారతీయ రెవెన్యూ సర్వీస్(కస్టమ్స్,పరోక్ష పన్నులు) అధికారుల పాత్ర కీలకమైనదని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్‌చౌదరి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా గోరంట్ల సమీపంలోని పాలసముద్రం వద్ద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసెన్)లో శిక్షణ పొందిన భారతీయ రెవెన్యూ సర్వీస్ (కస్టమ్స్, పరోక్ష పన్నులు) అధికారుల 74వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ బ్యాచ్‌లో 25 మంది పురుష అధికారులు, 10 మంది మహిళా అధికారులతో సహా మొత్తం 35 మంది అధికారులు ఉన్నారు. శుక్రవారం నిర్వహించిన ఈ పరేడ్‌కు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సిబిఐసి) ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ , సిబిఐసి బోర్డు మెంబర్లు శశాంక్ ప్రియ, యోగేంద్ర గార్గే, నా సిన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ గైగొంగ్దిన్ పన్మయి, సిబిఐసి సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి మాట్లాడుతూ వాణిజ్యాన్ని సులభతరం చేయడంలో భారత ఆర్థిక వ్యవస్థను పరిరక్షించడంలో కీలక బాధ్యతలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్న అధికారులను అభినందించారు. ఆర్థిక పురోగతి, సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ విజన్ వికసిత్ భారత్‌ను ముందుకు తీసుకెళ్లగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. సిబిఐసి ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, అధికారులు తమ విధుల్లో నిర్ణయాత్మకత, వినూత్నతతో పాటు అభిప్రాయాలను, సూచనలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. దేశ పన్ను, వాణిజ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాలన్నారు. నాశన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ గైగొంగ్దిన్ పన్మయి మాట్లాడుతూ శిక్షణ పొందిన అధికారులు దేశవ్యాప్తంగా తమ విభిన్న పాత్రల్లో అత్యున్నత ప్రమాణాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 74వ బ్యాచ్‌కు చెందిన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలు అందజేసి సత్కరించారు.విద్యా విషయాలు, హాజరు, శారీరక శిక్షణలో సమతుల్యత కనబరిచినందుకు కె. ప్రసాద్ కృష్ణన్‌కు ఆర్థిక మంత్రి బంగారు పతకం లభించింది. రాత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు సాహిల్ ఖరేకు ఛైర్మన్ బంగారు పతకం లభించింది. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన మహిళా అధికారి ముసలే అనుజా అనంత్‌కు కౌశల్య నారాయణన్ స్మారక బంగారు పతకం లభించింది. శిక్షణ అంతటా స్థిరమైన పనితీరు, అద్భుతమైన ప్రవర్తన కనబరిచినందుకు పంకజ్ గుజర్‌కు ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ బంగారు పతకం లభించింది. ఆదర్శవంతమైన క్రమశిక్షణ, ప్రవర్తన, సమిష్టి కృషి కనబరిచినందుకు వినీత్ బన్సోడ్‌కు ఎన్‌కె. ఉపాధ్యాయ్ స్మారక బంగారు పతకం లభించింది. ఈ పరేడ్‌లో అధికారులు ప్రదర్శించిన కవాతులు వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణను చాటిచెప్పాయి. దేశ ఆర్థిక వ్యవస్థను పెంపొందించే వారిగా దేశ రక్షకులుగా తమ పాత్రలను స్వీకరిస్తూ, సమగ్రత సేవ యొక్క విలువలను కాపాడతామని శిక్షణ పొందిన అధికారులు ఈసందర్భంగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్, ఎస్పీ రత్న, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి: లేపాక్షిలోనిశ్రీ వీరభద్ర స్వామి దేవాలయాన్ని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ విశిష్టతను అర్చకులు మంత్రికి తెలియజేసారు. దేవాదాయ కార్యనిర్వహణాధికారి .నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో కేంద్రమంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్, తహశీల్దారు సౌజన్య లక్ష్మి, హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ రైతులను ఆదుకోండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

శ్రీశైలం జలాశయంలోని నీటిని అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విద్యుత్ ఉత్పత్తి పేరుతో పూర్తిగా తోడేస్తున్నాయని, శ్రీశైలం నీటిని కాపాడి రాయలసీమ రైతులను రక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది శ్రీశైలం జలాశయానికి 1,622 టిఎంసీల వరద నీరు వచ్చినా హంద్రినీవా కింద సాగైన పంటలు పూర్తయ్యేవరకు నీరు వచ్చే పరిస్థితి కన్పించలేదన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి తక్షణం జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. శ్రీశైలం డ్యాంలోకి వచ్చిన నీటిని ఇప్పటికే తెలంగాణ 358.84 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 199.38 టీఎంసీలు విద్యుత్ పేరుతో కిందకు వదిలేశాయన్నారు. ప్రస్తుతం డ్యాంలో 105 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. ఈ కొద్దిపాటి నీటితో హంద్రీనీవా కాలువ కింద సాగైన పంటలు పూర్తయ్యేవరకు వచ్చే అవకాశం లేదన్నారు. గత సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు వేసికెళ్లే సమయంలో నీరు లేక అనంతపురం, కర్నూలు జిల్లాల రైతులు కోట్ల రూపాయలు నష్టపోయారన్నారు. మూడు నాలుగు సంవత్సరాలకు ఒకసారి కర్నాటకలో వచ్చే వరదలవల్ల శ్రీశైలం డ్యాంకు వరదనీరు చేరుతుందని వరదలు వచ్చినప్పుడు అదనపు నీటిని రాయలసీమ జిల్లాలకు తరలించడానికి ప్రస్తుతం వున్న హంద్రీనీవా కాలువ 354 క్యూసెక్కుల సైజ్ సరిపోదని అన్నారు. ఈ కాలువను కనీసం 6400 క్యూసెక్కుల సైజ్‌లో వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. కాలువ వెడల్పుకు గత ప్రభుత్వం జీవో ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. పదివేల క్యూసెక్కుల సైజ్‌తో కాలువ వెడల్పు చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం శ్రీశైలంలో వున్న నీటిని తెలంగాణ ప్రభుత్వం తోడేస్తుంటే అడ్డుకోవలసిందిపోయి పోటీపడి శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేయిస్తుందని విమర్శించారు. హంద్రీనీవా కాలువ కింద సాగుచేసిన మిరప, పత్తి తదితర పంటలు పూర్తయ్యేవరకు నీరు వదిలేటట్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కాలువ వెడల్పు కోసం, ప్రస్తుత పంటల రక్షణ కోసం హంద్రీనీవా సాగునీటికై ఈ నెల 19న కర్నూలులో సదస్సు, 27న అనంతపురం, కర్నూలు, నంద్యాల, కడప, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు రాంభూపాల్ తెలిపారు.

కార్మికుని విద్యుత్ ప్రమాదంతో

వెలుగులోకి అవినీతి భాగోతం

అనధికారికంగా పనులు చేపట్టిన గుత్తేదారు తప్పును కప్పిపుచ్చేందుకు ప్రయత్నాలు

ఒకే విద్యుత్‌స్తంభానికి రెండు లైన్లు లాగిన దృశ్యం

ప్రజాశక్తి - చిలమత్తూరు

అనధికారికంగా చేపట్టిన విద్యుత్‌లైను ఏర్పాటు పనుల్లో ఓ కార్మికుడు విద్యుత్‌షాక్‌తో గాయపడటంతో అవినీతి భాగోతం బయటపడింది. ప్రయివేటు విద్యుత్‌కాంట్రాక్టర్ చేపట్టిన స్వార్థపూరిత పని బయట పడటంతో విద్యుత్‌శాఖ అధికారులు ఉలిక్కిపడ్డారు. కాంట్రాక్టర్ చేసిన అక్రమాన్ని, అధికారుల నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆశాఖ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ తమవంతు ప్రయత్నాలను ప్రారంభించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈఘటనకు సంబంధించి విశ్వసనీయంగా అందించిన సమాచారం మేరకు వివరాలు...

చిలమత్తూరు మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఓ వ్యవసాయక్షేత్రంలో విద్యుత్ పనులు చేస్తూ కొడికొండ గ్రామానికి చెందిన యువకార్మికుడు గత నెల 7వ తేదీన విద్యుదాఘతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ కార్మికుడు బెంగుళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ ఘటనతో విద్యుత్ శాఖ ఉలిక్కి పడింది. విద్యుత్ శాఖ అదికారులు ఎల్‌సి ఇవ్వని కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అందరూ అభిప్రాయ పడ్డారు. ఈ విషయంపై మరింత విచారణ జరిపితే అసలు విషయం బయటపడింది. ఆ వ్యవసాయ క్షేత్రానికి సంబందించి ఈ పనికి ఎలాంటి అనుమతులు లేవని కనీసం ఎస్టిమేషన్లు లేవని తెలుస్తోంది. వ్యవసాయ క్షేత్రంలో లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన సుమారు 10 విద్యుత్‌స్తంభాలు ఉన్నాయి. త్రీఫేజ్ లైనుకు ఇంకో ఎస్టిమేషన్ ఎందుకు, అనుమతి ఎందుకు అని భావించిన కాంట్రాక్టర్ ప్రస్తుతం ఉన్న విద్యుత్‌స్తంభాలకు ఉన్న వైరు కిందిభాగాన వ్యవసాయ రంగ విద్యుత్‌కోసం ఎలాంటి అనుమతులు లేకుండానే 500 మీటర్ల కేబుల్‌ని అక్రమంగా లాగే పనిని ఈ నెల 7 వతేదీన చేపట్టారు. ఈ క్రమంలో విద్యుత్‌స్తంభం పైన ఉన్న వైరును ప్రమాదవశాత్తు తగిలిన కార్మికుడు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఇది అనాధికారిక పని కావడంతో ఎల్ సి తీసుకుంటే విద్యుత్ శాఖ అధికారులకు తెలుస్తుందని భావించి ఎల్ సి తీసుకోకుండా కార్మికులకి ఎలాంటి రక్షణ కావచాలు ఇవ్వకుండా సదరు గుత్తేదారు పని చేయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ లైన్‌లాగే క్రమంలో కార్మికుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. కార్మికుడు విద్యుత్‌షాక్‌కు గురై ఆసుపత్రి పాలయ్యాడన్న విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు దీని గురించి ఆరా తీయంగా ఇది అక్రమ పనిగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ పనికి ఎస్టిమేషన్ వేస్తే సుమారు రూ.3 లక్షలు దాక ఖర్చు వస్తుంది. అందులో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ఇదంతా విద్యుత్‌అధికారుల విచారణంలో బయటపడుతుందని గుర్తించిన గుత్తేదారు ఆకేబుల్‌ను మరుసటి రోజే తొలిగించి దాచేసినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా అధికారుల విచారణలో ఇవేవీ బయటపడకుండా ప్రమాదానికి గురైన కార్మికుడి కుటుంబ సభ్యులతో మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. అధికారులు విచారణ చేసే తన ప్రమాదంలో కాంట్రాక్టర్ పాత్ర ఏ మాత్రం లేదని తానే విద్యుత్ దీపాన్ని సరిచేసేందుకు పోల్ ఎక్కానని చెప్పాలని బాధిత కార్మికుడితో ఒప్పించుకున్నట్లు సమాచారం. ఇందుకు ఫలితంగా బాధిత కుటుంబానికి తమ వంతు సాయం చేస్తామని కూడా హామీ ఇచినట్లు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంలో మండల విద్యుత్ శాఖ అధికారి సహకరించారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈని పోన్ ద్వారా సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

హెల్పర్లకు వర్కర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలి

ఐసిడిఎస్ అధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, అంగన్వాడీలు

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీ హెల్పర్లకు కార్యకర్తలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని ఆ సంఘం కార్యకర్తలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని ఆ సంఘం ప్రతినిధులు అరుణ, శోభ విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, అయితే అర్హత ఉన్న హెల్పర్లకు కార్యకర్తలుగా ఉద్యోగోన్నతులు ఇవ్వకుండా నోటిఫికేషన్ జారీ చేయడం తగదన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్ కు సంబంధించి సమయం కూడా చాలా తక్కువగా ఉందన్నారు. శనివారం నుండి వరుసగా ఐదు రోజులపాటు సెలవు రోజులు కావడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి అర్హత కలిగిన సహాయకులకు కార్యకర్తలుగా ఉద్యోగోన్నతలుకల్పించి మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భారతి, నాగమ్మ, జయమ్మ, ఆశ, తహసీన్, శ్యామలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు.

వెయ్యి అరటి చెట్లు నరికివేత

రూ. 5 లక్షల నష్టం

ప్రజాశక్తి - పుట్లూరు

పుట్లూరు మండలంలోని కొండగారికుంట గ్రామంలో ఓ రైతుకు చెందిన వెయ్యి అరటి చెట్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు సుదర్శన్ నాయుడు అనే రైతుకు యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో 7 ఎకరాలు భూమి వుంది. అందులోని 3ఎకరాలలో 3,500 అరటి చెట్లు నాటారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వెయ్యి అరటి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. దీంతో బాధిత రైతుకు రూ. 5 లక్షల దాకా నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ సత్యబాబు శుక్రవారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ బాల రంగయ్య, చెవ్వ కుల శేఖర్ రెడ్డి, ఎల్ కె చిన్నారెడ్డి, గోవర్ధన్ రాజు, బ్రహ్మయ్య, రాముని రెడ్డి, విజయ్, ప్రసాద్, కంది కాపుల సర్పంచి శివరామయ్య, పుట్లూరు సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు రవికుమార్ రెడ్డి బాధిత రైతును పరామర్శించారు.

నరికివేసిన చెట్లను పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

చెట్లు నరికే సంస్కృతిని విడనాడాలి : చెట్లు నరికే విషసంస్కృతిని విడనాడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటి సభ్యులు ఆలం నరసానాయుడు, మాజీ ఎమ్మెల్యే యామిని బాల అన్నారు. ఈ మేరకు వారు వేర్వేరుగా బాధిత రైతు పొలాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కన్న బిడ్డల్లా పెంచుకున్న అరటి చెట్లను నరికి వేయడం చాలా దారుణమన్నారు. చెట్లు నరికే విషసంస్కృతిని విడనాడాలని ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అశోక్, బాలరంగయ్య, శ్రీరామరెడ్డి, శివశంకర రెడ్డి , జేఆర్ పేట బాబు, కోమటికుంట కులశేఖర్ రెడ్డి, పుట్లూరు మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సర్వే వేగవంతం చేయాలి

కలెక్టర్ టిఎస్ చేతన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ప్రతి ఇంటిని ఎఎన్ఎంలు, వాలంటీర్స్ సందర్శించి కుష్టు వ్యాధి పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన, కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫైరోజ్ బేగం, జిల్లా లెప్రసి ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ తిప్పయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధిపై ఉన్న అపోహాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుష్టు వ్యాధి సోకిన ప్రతి ఒక్క వ్యక్తిని గుర్తించి చికిత్సలు అందించాలన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు 14 రోజులపాటు ఇంటింటి సర్వే చేపట్టి తగిన వైద్య సేవలు అందించాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందిస్తే 6 నెలల్లో పూర్తిగా నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

జాతీయ రహదారి భద్రత మహోత్సవాలను పురస్కరించుకుని రహదారి ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో రవాణా శాఖ ఆధ్వర్యంలో తయారుచేసిన కరపత్రాలు బ్యానర్లు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యంగా వాహనదారులకు విద్యార్థులకు రహదారి ప్రమాదాలపై కల్పించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ, వాహనదారులకు హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం వల్ల జరిగే ప్రయోజనాలు తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు వరప్రసాద్, రాణి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో జరగనున్న 76 వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకలకు సంబంధించి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ప్రభుత్వ, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రగతి నివేదికలను ఆయా శాఖల అధికారులు సంక్షిప్తంగా ఈనెల 17 న జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల అధికారి వారికి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, జిల్లాలోని అన్ని శాఖలు హెచ్ఒడిలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బాసటగా నిలుస్తాం : టిడిపి

ప్రజాశక్తి-హిందూపురం

రైతులకు బాసటగా కూటమి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా పనిచేస్తుందని టిడిపి కో ఆర్డినేటర్ శ్రీనివాస రావు పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రూరల్ మండలం కిరికెర, బేవినహళ్లిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోకులం షెడ్డులను టిడిపి నాయకులతో కలిసి శ్రీనివాస రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతు అందుకే రైతులకు అండగా నిలిచేందుకు ఈ గోకులం పథకం ఉపయోగ పడుతుందన్నారు. గ్రామంలో మూడు గోకులం షెడ్డులను నిర్మించి ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజి, కిరికెర మాజీ సర్పంచి రాము, వేవినహళ్లి ఆనంద్, ఎపిడి,ఎపిఎం, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జెవివి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరపు క్యాలెండర్‌ను శుక్రవారం విడుదల చేశారు. పట్టణంలోని చైతన్య నగర్ లో ఉన్న పీపుల్స్ క్లినిక్ లో జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకష్ణ, డాక్టర్ ఈటి రామ్మూర్తి తదితర జె.వి.వి ప్రతినిధులు క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు జిఆర్ శ్రీనివాసులు, అతావుల్లా, మురళీమోహన్, ఉగ్రప్ప, గంగిరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ లక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాజేంద్రనగర్ -4(ఓసి), రామనగర్-3(ఎస్టీ) అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్త పోస్టుకు, సంజయ్‌నగర్, దుర్గానగర్-1(బీసీ-ఇ), రామనగర్-3(బీసీ-డి), రామనగర్-7(ఓసి), మల్లేనిపల్లి(ఎస్సీ), సి.బత్తలపల్లి (ఎస్సీ)లోని కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు ఈ నెల 25వ తేదీ లోపు మీ పంచాయతీ లేదా వార్డు పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానికంగా ఉంటూ వివాహమైన మహిళలు పదో తరగతి పాసై 2024 జులై 1వ తేదీ నాటికి 21-35 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు. అవివాహితులు అనర్హులన్నారు.

బుక్కపట్నం : మండలంలోని కృష్ణాపురం-1(ఒసి), 2(బిసి-ఎ) అంగన్వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు ఈ 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ గాయత్రి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కౌశల్యసాయి తెలిపారు.

గడువు పొడిగించాలని వినతి

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో అంగన్వాడీ, మినీ అంగన్వాడీ, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించాలని కోరుతూ జిల్లా అంగన్వాడీ కమిటీ సభ్యులు ఐసిడిఎస్ పిడి వరలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. అలాగే ఆయాలకు వర్కర్లుగా ఉద్యోగోన్నతి ఇచ్చిన తర్వాతే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబయ్య, అంగన్వాడీ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీదేవి, అధ్యక్షురాలు సుజాతమ్మ, కోశాధికారి మంజుల, జిల్లా కమిటీ సభ్యులు పద్మావతి పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి-కదిరి టౌన్

వాహన యజమానులు ట్యాక్స్ గడువు కు 10 రోజుల ముందే ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఎంవిఐ వరప్రసాద్ తెలిపారు. లేనిచో మీ వాహనం ట్యాక్స్ చెల్లింపులు జరగవ న్నారు.

ఇసుకరీచ్ పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని మర్రికొమ్మదిన్నె గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఇసుకరీచ్‌ను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. అనుమతి లేకుండా అధిక ధరకు ఇసుక విక్రయిస్తున్నట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని తహశీల్దార్ దేవేందర్ నాయక్‌ను ఆదేశించారు. జెసి వెంట ఆర్డీవో వివిఎస్.శర్మ, విఆర్ఒ రఘునాథ్, రైతులు ఉన్నారు.

ఫిబ్రవరిలో ఎంప్లాయిస్ మెగా షటిల్ టోర్నీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఇండియ లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో పట్టణంలో ధర్మవరం ఎంప్లాయిస్ మెగా షటిల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తామని, పట్టణంలోని ఉద్యోగులు పాల్గొని విజయ వంతం చేయాలని నిర్వాహకులు ప్రసాద్, ప్రవీణ్, నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో మహేష్ చేత టోర్నీ కరపత్రాలను విడుదల చేయించారు. టోర్నీలో పాల్గొనే వారు ఈ నెల 25వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ రుసుము రూ. 600 చెల్లించాలన్నారు. విన్నర్స్‌కు రూ. 10వేలు, రన్నర్స్‌కు రూ. 5వేలు, టోర్నీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జ్ఞాపిక అందజేస్తామ న్నారు. వివరాలకు 97012 13058 , 80734 59509 , 81797 74420 సంప్రదించాలన్నారు.

19న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 19వ తేదీ సింగంరెడ్డి వెంకటలక్ష్మమ్మ, సింగంరెడ్డి రామిరెడ్డి, సింగం రెడ్డి మమత, సింగంరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహా, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. క్యాంపు ఛైర్మన్‌గా విజయభాస్కర్ వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కృష్ణమూర్తి, కొండయ్య, సత్రశాల ప్రసన్నకుమార్, శివయ్య, గట్టు హరినాథ్, రత్నశేఖర్‌రెడ్డి, రమేష్ బాబు, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యురాలు అంబికా, శుక్లాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని ఉడుమలకుర్తి, గొల్లపల్లితండా, తదితర గ్రామాల్లో శుక్రవారం సిఎస్ఎ సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎఫ్ కోఆర్డినేటర్ శ్యామల రైతులకు పంట, నీటి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నీటి సంరక్షణ కోసం అందరం పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విఎఎ స్వరూప, బిఓడి మెంబర్ వెంకటేశ్వర్లు, మోహన్, సిఆర్పీ శారద, సుజిత, కెవి.రమణ, సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-మడకశిర

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సభ్యులు మాట్లాడుతూ చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమైందని, పాఠశాలల్లో సమస్యలు నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. సమావేశంలో ఎంపిడిఒ సోనియా బాయి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరసింహ, ఏవో శ్రీనివాస రావు, వైస్ ఎంపిపి నరసింహమూర్తి, రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, సభ్యులు హాజరయ్యారు.

సమ్మెకాలం హామీలు అమలుచేయాలి

మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రభుత్వం తక్షణమే సమ్మె కాలం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో బాబావలి అధ్యక్షతన మున్సిపల్ కార్మికులు పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టిన సమయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం హామీలు, జీవోలు ఇచ్చిందన్నారు. వాటిని అమలు చేయాలని 7 నెలలుగా కోరినా ప్రయోజనం లేదన్నారు. మృతి చెందిన కార్మికులకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రమాదంలో మృతి చెందితే రూ. 7 లక్షలు, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంపు, బెనిఫిట్స్, పిఎఫ్, ఈఎస్ఐ, పనిముట్లు, దుస్తులు, సబ్బులు, చెప్పులు, శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు, చీపుర్లు, ఇంజినీరింగ్ కార్మికులకు కనీసం వేతనం, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, చేనేత కార్మిక సంఘం నాయకులు నారాయణస్వామి, సిఐటియు నాయకులు మహబూబ్‌బాషా, నరసింహా, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వెంకటేష్, నాగమ్మ, ముత్యాలు, నరసింహులు, కార్మికులు రాఘవేంద్ర, ప్రసాద్, నరసింహా, వెంకటేష్, జబ్బార్, చలపతి, ఓబులేసు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు సిఐటియు నాయకులు రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే దశల వారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ నాయకులు రమేష్, బాషా, నాయకులు రామయ్య, నరసింహులు, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, నాయకులు టి.అయూబ్‌ఖాన్, ఎల్. ఆదినారాయణ, ఎం.బాబు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, పట్టణ కార్యదర్శి జయ, పారిశుధ్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేష్, పట్టణ కార్యదర్శి ముకుంద పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్మికులు ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పెనుకొండలో నగర పంచాయతీ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు అనిల్‌కుమార్, దస్తగిరి, పెద్దన్న, కాటమయ్య, బాబు, సురేష్, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు కేశవ, రామకృష్ణ, ఓబుళపతి, ఓబులేసు, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

హిందూపురం : సమ్మెకాలం హామీలు తక్షణమే అమలు చేయాలని, లేనిచో సమ్మెకు సిద్ధం అవుతామని మున్సిపల్ పారిశుధ్య వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జగదీష్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు మున్సిపల్ పారిశుధ్య వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఇందిరా పార్కు నుంచి మున్సిపల్ కార్యలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి, మున్సిపల్ కార్యలయం ముందు రిలే దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి బాబయ్య, రామచంద్ర, గుర్నాథ్, చంద్ర, హనుమంతు, నారాయణ మూర్తి, మహిళా నాయకురాలు కవితమ్మ, ఓబులమ్మ, మహేశ్వరమ్మ, సుబ్బలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకున్న ఘనత టిడిపిదే

ప్రజాశక్తి-మడకశిర

గోకులం షెడ్డను ప్రారంభిస్తున్న గుండుమల, తదితరులు

రైతులను అన్ని రంగాల్లో ఆదుకున్న ఘనత టిడిపికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బుల్లసముద్రం గ్రామంలో మహిళా రైతు గంగరత్నమ్మకు ఉపాధి హామీలో భాగంగా రూ. 1.85 లక్షల వ్యయంతో గోకులం షెడ్డును నిర్మించారు. ఈ గోకులం షెడ్డును శుక్రవారం గుండుమల తిప్పేస్వామి ప్రారంభించి మాట్లాడారు. రైతాంగానికి టిడిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం లో ఎపిడి లక్ష్మీనారాయణ, ఎపిఒ శ్రీకాంత్‌గౌడ్, ఎడి ఉమర్, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు గిరిజమ్మ, షానవాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్, మాజీ సర్పంచి జయపాల్, కల్లుమరి సర్పంచి నాగరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, నాయకులు నరేష్‌కన్నా, రవీంద్రారెడ్డి, రఘురాం, చంద్రశేఖర్, నాగేంద్ర పాల్గొన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మండలంలోని భక్తరహల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామిని, కల్లుమర్రి పంచాయతీలోని తడకలపల్లిలో వెలసిన వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట కల్లుమర్రి సర్పంచి నాగరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొండూరులో గోకులం షెడ్ ప్రారంభం

లేపాక్షి : మండలంలోని కొండూరు గ్రామంలో ఏర్పాటుచేసిన గోకులం షెడ్‌ని టిడిపి మండల కన్వీనర్ జయప్ప ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులకు 50 గోకులం షెడ్లు మంజూరు కాగా ఒక్కో దానికి రూ. 2.3 లక్షలు కేటాయించారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, సర్పంచి సిద్ధు, ఉపాధి హామీ సిబ్బంది రవికుమార్, నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంచుకోండి : కమిషనర్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రహ్లాద

వృత్తి సేవల్లో నైపుణ్యం పెంచుకోవాలని అందుకు హోం ట్రయాంగిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద సూచించారు. 'ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త వాక్ టు వర్క్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్యుటీషియన్, సెలూన్ మెయిన్, కార్పెంటర్, ప్లంబర్, టీవీ, గీజర్ మెకానిక్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ రిపేరీ, తదితర పనులు చేస్తూ ఆసక్తి ఉన్న వారు అవగాహన పెంచుకొని లబ్ధి పొందాలన్నారు. ఈ మెగామేళాకు 50 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. సదస్సులో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తిప్పన్న, ప్రశాంతి మహిళా సమైక్య అధ్యక్షురాలు పద్మావతి, మెప్మా సిఎంఎం రమాదేవి, సిఒలు దూద్‌పీరా, ధరణి, ఆర్పీలు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత ఉపాధ్యాయునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని సి.వెంకటాపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ముస్తఫా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకు చికిత్సకు రోజుకు రూ. 15 నుంచి రూ. 20 వేలు ఖర్చు చేయాల్సి ఉండగా ఇప్పటికే దాదాపు రూ. 20 లక్షలకు పైగా ఖర్చయింది. ఆయన పరిస్థితి తెలుసుకున్న ఓబుళా పురం, వెంకటాపురం గ్రామస్తులు, మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రేడ్-2 హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ స్టాఫ్ అందరూ కలిసి ఎంఇఒలు నాగరాజునాయక్, కుళ్లాయప్ప ఆధ్వ ర్యంలో రూ. 2 లక్షలు సేకరించి శుక్రవారం ముస్తఫా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఇస్మాయిల్ ఖాన్, రియాజ్, తిమ్మయ్య, సాయినాథ్, రామలింగం, సురేష్, హిదయితుల్లాఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, కిశోరలింగేశ్వర, విజయశేఖర్, రామదాస్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై శిక్షణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఉపాధి హామీ పనులపై శుక్రవారం స్థానిక నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎపిఒ అనిల్‌కుమార్, ఇరిగేషన్ అధికా రులు మాట్లాడుతూ గోకులం షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, గ్రామల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతి రైతును గుర్తించి వారి వివరాలు నమోదు చేసుకొని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సాంకేతిక అంశాలపై ఉపాధి సిబ్బంది పూర్తి సమాచారం కలిగి ఉండాలన్నారు.

'చిత్రావతి' భూనిర్వాసితులకు పరిహారం జమ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మంత్రి సత్యకుమార్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజలు

ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం చిత్రావతి జలాశయం భూనిర్వాసితులకు పరిహారం సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ. 10 లక్షల చొప్పున అందజేసింది. ఈ విషయంలో చొరవ చూపిన మంత్రి సత్యకుమార్ యాదవ్ చిత్ర పటానికి శుక్రవారం తాడిమర్రి మండలంలోని మర్రిమాకులపల్లె ఎస్సీ కాలనీవాసులు పాలాభిషేకం చేశారు. నిర్వాసిత లబ్ధిదారులు మాట్లాడుతూ చిత్రావతి జలాశయం నిర్మాణంలో భాగంగా తాము ఇళ్లు కోల్పోయినా గత వైసిపి ప్రభుత్వం పరిహారం విషయంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎన్నికల హామీ మేరకు మంత్రి సత్యకుమార్ పరిహారం ఇప్పించారని హర్షం వ్యక్తం చేశారు.

12న పల్లె పండుగ వారోత్సవాలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని బుచ్చయ్యగారిపల్లి, సిద్దరాంపురం పంచాయతీల్లో ఈ నెల 12వ తేదీ పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మినీ గోకులాను ప్రారంభిస్తామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొనాలన్నారు.

మైనార్టీ ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడిగా వాసిమ్ బేగ్

ప్రజాశక్తి-మడకశిర

మైనార్టీ ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షులుగా వాసిమ్‌బేగ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ ఓ ప్రకటనలో తెలిపారు. వాసిమ్‌బేగ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, వారి అభ్యున్నతికి పని చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు జాఫర్, రాష్ట్ర స్పోక్ పర్సన్ ఖలీల్ సయ్యద్, జిల్లా అధ్యక్షులు గౌస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని వివిధ గ్రామాల్లో పూర్తయిన గోకులం షెడ్లను ప్రారంభించడానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం గొల్లవారిపల్లి వస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఊటకూరులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని ఊటకూరు జడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా సౌజన్యంతో డాక్టర్ సురేష్, ఎంఎస్ఎఫ్ ఆదర్శ బాబి ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో జిఆర్‌బిఎస్, బిపి, ఇసిజి. 2డి ఎకో, తదితర పరీక్షలు చేశారు. 300 మందికి పలు రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఊటకూరు పిహెచ్‌సి డాక్టర్ సురేష్, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యాసీన్‌సుర చిత్రపటాలు పంపిణీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న నానా దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ముదిగుబ్బ మండలానికి చెందిన ఇలియాజ్ దంపతులు యాసీన్‌సుర చిత్రపటాలను ఉచితంగా పంపిణీ చేశారు. శనివారం గంధంతో నానా దర్గా ఉరుసు ప్రారంభమవుతుంది. ఆదివారం ఖవ్వాలీ, సోమవారం ఉరుసు ఉత్సవం కార్యక్రమాలు ఉంటాయి. ఉరుసు ఉత్సవాలకు అన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నానా దర్గా కమిటీ సభ్యులు కటిక ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఎస్సీ ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గంలోని ఎస్సీ(మాదిగ) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు వినతి పత్రం సమర్పించినట్లు ఎంఇఎఫ్ తాలూకా అధ్యక్షుడు రంగనాథ్ తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉగ్రనరసింహ, ట్రెజరర్ నగేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజును సన్మానిస్తున్న దళిత ఉద్యోగులు

రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, తదితరులు

రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్స వాలు పురస్కరించుకొని శుక్రవారం ఆయన కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎస్పీ వి.రత్న, ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యాప్తంగా రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా వాహనదారులు, పాఠశాలల విద్యార్థులకు రహదారిపై జరిగే ప్రమాదాలను ఎలా అరికట్టాలనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో వాహనదారులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వివరిద్దామన్నారు. ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. అనంతరం రవాణా శాఖ ముద్రించిన కరపత్రాలు, బ్యానర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి కరుణసాగర్‌రెడ్డి, బిఎస్ఎం వరప్రసాద్, ఎంవిఐ రాణి, ఎఎంవిఐ ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బిసిల పక్షపాతి చంద్రబాబు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

సిఎం చంద్రబాబు బిసీల పక్షపాతి అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అభివర్ణించారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్టీఆర్ బిసిల్లో రాజకీయ చైతన్యం తీసుకురాగా చంద్రబాబు అదే బాటలో పయనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విశ్వకర్మ, వాల్మీకి, కనకదాసు జయంతి వేడుకలను అధికారికంగా రాష్ట్ర పండుగలా నిర్వహిస్తోందన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం ఈ నెల 11వ రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. పుట్టపర్తిలో జరిగే వడ్డే ఓబన్న జయంతి వేడుకల్లో వడ్డెర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో గతేడాది చేపట్టిన ఉపాధి హామీ పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు ప్రతి గ్రామంలో పర్యటించి తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 19 పంచాయతీలకు గానూ రూ. 2.57కోట్ల పనులు జరగ్గా సామాజిక తనిఖీ బృందం రూ. 88 వేలు రికవరీ చేసినట్లు ఎపిఒ అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామకుమార్, పిడి విజయేంద్రప్రసాద్, డివిఒ రమణారెడ్డి, ఎపిఒ అనిల్‌కుమార్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

18న నవోదయ ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి-కొత్తచెరువు

జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతితో ప్రవేశానికి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డిఇఒ జి.కృష్ణప్ప శుక్రవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,987 మంది దరఖాస్తు చేసుకోగా 34 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 95732 87480ను సంప్రదించాలన్నారు.

జనసేనపార్టీలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని పార్థసారథినగర్‌కు చెందిన 30 కుటుంబాలు శుక్రవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. చిలకం మాట్లాడుతూ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, ఏ ఆపద వచ్చినా ముందుం టానని హామీ ఇచ్చారు. చేరిన వారు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డిష్ రాజు, సంకు అఖిల్, బిసి మల్లన్న, జీవనసాయి, గంగాధర్, వెంకటేష్ నాగేంద్ర, కొండన్న, అనిల్, వినోద్, మస్తాన్ పాల్గొన్నారు.



చిలకం సమక్షంలో జనసేనపార్టీలో చేరిన నాయకులు

నేరాలు ఘోరాలు

ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఇద్దరు పిల్లలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని కుమ్మరపేటకు చెందిన నాగవేణి ఉదయం ఆరేళ్ల కుమార్తె, మూడేళ్ల కుమారుడితో కలిసి చిత్రావతి చెక్ డ్యాంలో దూకింది. స్థానికులు గుర్తించి వారికి క్షేమంగా రోడ్డుకు చేర్చారు. బాలుడు పరిస్థితి విషమంగా ఉండడంతో సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బలో శివప్రసాద్(45) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న శివప్రసాద్ మానసిక, ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. ఈ క్రమంలో శుక్రవారం ఆయన ఇంట్లో పైకప్పునకు తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ దాదాపీర్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తచెరువు మండలంలోని మైలేపల్లి గ్రామంలో ఉన్న కరుణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రోషన్ జమీర్ హాజరై మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో కుల, మతాలకు అతీతంగా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కలీం, ఇనాయతుల్లా, జాఫర్, ముహమ్మద్‌గౌస్, షబ్బీర్, మస్తాన్‌వలి, నబిరసూర్, ముంతు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాదాపీర్

హత్యాయత్నం కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

హత్యాయత్నం కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు హిందూపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులుతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లికి చెందిన నారాయణరెడ్డి నాలుగేళ్లపాటు ముద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చీరలను పాలిష్ చేసి సరఫరా చేసే బాలకృష్ణ అను వ్యక్తి దగ్గర డ్రైవర్ గా పని చేసేవాడు. సుమారు 4 నెలల క్రితం వారి మధ్య డబ్బుల విషయంలో మనస్పర్ధలు ఏర్పడి నారాయణరెడ్డి అతని వద్ద పని మానివేసి సొంతంగా ఆటో పెట్టుకొన్నాడు. తానే కస్టమర్ల దగ్గరి నుండి చీరలను తీసుకొని వాటిని యలహంకలో పాలిష్ చేయించి ముద్దిరెడ్డి పల్లి, ధర్మవరానికి సరఫరా చేస్తూ ఉండేవాడు. నారాయణరెడ్డి సొంతం గా ఆటో పెట్టుకోవడం వ్యాపారం చేస్తుండడంతో బాలకృష్ణకు బాగా నష్టం వచ్చింది. అంతే కాకుండా ఈ మధ్య కాలంలో సరైన బిల్లులు లేకుండా చీరలను సరఫరా చేస్తున్న బాలకృష్ణ వాహనాలను జీఎస్టీ అధికారులు పట్టుకొని అపరాధరసుం విధించారు. దీంతో బాలకృష్ణ బాగా నష్ట పోయినాడు. అప్పటి నుండి అతను నారాయణరెడ్డి పై కక్ష పెంచుకొని ఎలాగైనా అతన్ని అంతం చేయాలని పథకం పన్నాడు. తనకు, నారాయణరెడ్డి ఇద్దరికీ పరిచయం ఉన్న హిందూపురం పట్టణంలోని శాంతి నగర్ కు చెందిన ఫక్రుద్దీన్ అలియాస్ చోటు అను వ్యక్తి ద్వారా అతని స్నేహితులు కర్ణాటక రాష్ట్రం, గౌరిబిదనూర్ కు చెందిన ముబారక్, ఫరూక్ అలియాస్ చిరిలను కలిశాడు. నారాయణరెడ్డిని చంపడానికి రూ.5 లక్షల కాంట్రాక్టు మాట్లాడాడు. ఈ మేరకు వారు రెండు సార్లు గౌరిబిదనూర్ వద్ద, నారాయణ రెడ్డి ఇంటి సమీపంలో అతనిని చంపడానికి ప్రయత్నం చేయగా నారాయణరెడ్డి వారికి కనపడలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 7 వ తేదీ హిందూపురంలో ఇస్తేమా జరుగుతున్న సందర్భంగా నారాయణరెడ్డి వద్ద డ్రైవర్ గా పని చేసే తౌసిఫ్ పనికి రానందున నారాయణరెడ్డి ఒక్కడే సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ చీరల తీసుకొని ధర్మవరం, అక్కడి నుండి బెంగళూరుకు వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న ఫక్రుద్దీన్ అలియాస్ చోటు తన స్నేహితులకు ఫోన్ చేసి హిందూపురానికి పిలిపించుకొని నారాయణరెడ్డి కి ఫోన్ చేశాడు. తన స్నేహితులు వచ్చా రని కలిసి మద్యం తాగుదామని పిలిచారు. కర్నాటక నుండి మందు తీసుకొని రా, దారిలో కలుద్దామని చెప్పి ఈ నెల 8 వ తేదీ అర్ధరాత్రి 1 గంటకు చీరలు తీసుకొని బెంగళూరు నుండి ముద్దిరెడ్డిపల్లి గ్రామానికి వస్తున్న నారాయణరెడ్డిని పూలకుంట లోటస్ స్కూల్ సమీపంలో గల లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం వద్ద కలిశారు. ఫక్రుద్దీన్ అలియాస్ చోటు, తన స్నేహితులు ముబారక్, ఫరూక్ అలియాస్ చిరి, టిప్టూర్ కు చెందిన సైఫుల్లా, ఉమర్ లు కలిసికలిసి పూలకుంట చెరువు కట్టపై నారాయణరెడ్డి తెచ్చిన మందు తాగి ముందుగా వేసుకున్న పథకం ప్రకా రం అయిదుగురు నారాయణరెడ్డిని పట్టుకొని గొంతుపై బలంగా కత్తితో పొడిచారు. నారాయణరెడ్డికి తీవ్ర రక్తస్రావం కావడంతో కుప్పకూలిపోయాడు. దీంతో నారాయణరెడ్డి చనిపోయాడని భావిం వెళ్లిపోయారు. అయితే నారాయణరెడ్డి తెల్లవారు జామున కొత్తిమీర తీసుకొని హిందూపురం మార్కెట్‌కు పోతున్న ఆటో వారి సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ప్రాథమిక పరీక్షలు చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు సిఫార్సు చేశారు. ప్రస్తుతం నారాయణరెడ్డి బెంగళూరు లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న హిందూపురం రూరల్ పోలీసులు నలుగురు నిందుతులను శుక్రవారం అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని వారిని త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. సంఘటన జరిగిన 24 గంటల్లోపు కేసులు చేధించిన హిందూపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ వై. వెంకటేశ్వర్లు, హిందూ పురం రూరల్ యూపీ ఎస్ సిఐ ఆంజనేయులు, హిందూపురం రూరల్ సర్కిల్ సీఐ జనార్ధన్ లేపాక్షి ఎస్ ఐ నరేంద్ర తదితర సిబ్బందిని ఎస్పీ వి. రత్న అభినందించారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి వెంకటేశ్వర్లు